సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

బుధవారం
18 సెప్టెంబరు
2024
పేజీలు 8

గుంటూరు
పల్నాడు



# నాణ్యమైన లిక్కరు..
# కారు చౌక..

- మద్యం పాలసీతోనే మందుబాబులకు ఉపశమనం
- ఏపీ సర్కారు కొత్త నైవేద్యం
- కారు చౌకగా మేలిమి బ్రాండ్లు
- ప్రముఖ బ్రాండ్లు మరలా అందుబాటులోకి
- తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం
- కొత్త ఎక్సైజ్ పాలసీని కసరత్తు చేస్తున్న ప్రభుత్వం

నేటి దినపత్రిక సూర్య, ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో

చేతిలో పైసా లేదు.. అప్పులు దొరకవు.. పాత అప్పుల వడ్డీలకే సంపాదన సరి.. ఇదీ ఏపీ సర్కారు దైన్య స్థితి.. ఉద్యోగులకు జీతాలివ్వాలి.. పెన్షన్లు ఇవ్వాలి.. సూపర్ సిక్స్ కు సూపర్ పొటాషే బలం.. ఇక ఉన్నది ఒకటే దారి.. ట్యాక్స్ పెయిర్సే ఆపద్బంధావులు.. మందుబాబులే లేకుంటే పరిపాలనే ఉండదంటే ఆశ్చర్యం కాదు.. ఇదే పచ్చి నిజం.. ఇప్పటికే వైసీపీ ప్రభుత్వం పుణ్యమా..? అని చీప్ లిక్కర్‌నే స్కాచ్ ధరకు అంటగట్టారు.. అందినంత పిండుకున్నారు.. మద్యం పుత్రులు మాత్రం అనారోగ్యంతో బక్కచిక్కిపోయారు.. ఆడోళ్ల పసుపు తాళ్లు తెగాయని పలువురు ఆరోపించారు.. ఇక తాజా ప్రభుత్వమూ తాగనోడెందుకు ఈ లోకంలో అనే రీతిలో.. మద్యం ఆదాయం కోసం కొత్త తాయిలాలను రెడీ చేస్తోంది.. కారు చౌక.. నాణ్యమైన లిక్కరు నినాదంతో ఏపీలో కొత్త మద్యం పాలసీ తెరమీదకు వస్తోంది.. దీనికి కారణం.. తక్షణమే గల్లాపెట్టె నిండాలి.. ఏపీలో కొత్త మద్యం పాలసీ కసరత్తులు తుది దశకు చేరుకున్నాయి. ఎన్నికల్లో

మిగతా 3లో..






## రైతులందరూ ఈ కేవైసీ చేయించుకోవాలి



**దుగ్గిరాల ,మేజర్ న్యూస్** .దుగ్గిరాల మండల పరిధిలోని రైతులందరూ తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. శిరీష తెలిపారు. ఈ కేవైసీ తోనే పంట నమోదు ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మండలం లోని రైతులందరూ సంబంధిత రైతు సేవ కేంద్రాల వద్ద ఆధార్ కార్డు మరియు ఆధార్ తో లింకు అయిన ఫోను తీసుకుని వెళ్లి.ఈ కేవైసీ చేయించుకోవాలని అన్నారు. ఈ కేవైసీ ప్రక్రియఈనెల 23వ తేదీతో గడువు ముగిస్తున్నందున ప్రతి రైతు తప్పనిసరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని దుగ్గిరాల మండల వ్యవసాయ అధికారి పి .శిరీష తెలిపారు.

## ముగిసిన మాజీ ఎంపీ నందిగం సురేష్ పోలీసు కస్టడీ

### విచారణలో కీలక అంశాలు సేకరణ



**మంగళగిరి, మేజర్ న్యూస్:** టిడిపి కేంద్ర కార్యాలయం దాడి కేసులో రిమాండ్ లో ఉన్న బాపట్ల మాజీ ఎంపి నందిగం సురేష్ రెండు రోజులు పోలీసుల కస్టడీ విచారణ మంగళవారం ముగిసింది. మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయం లో రెండు రోజుల పాటు కొనసాగిన పోలీసు విచారణలో పూర్తి స్థాయిలో సురేష్ సహకరించలేదని తెలుస్తుంది. రెండు రోజుల పాటు 45 ప్రశ్నలతో విడతల వారిగా సురేష్ ను విచారించగా కీలకం సమాచారం ను సేకరించినట్లుగా తెలుస్తుంది. పలు ప్రశ్నలకు తెలియదు, గుర్తులేదు అనే సమాధానం వచ్చినట్లుగా పోలీస్ వర్గాల నుండి వినిపిస్తుంది. మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ లోనే మధ్యాహ్నం సురేష్ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మంగళగిరి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం గుంటూరు జిల్లా జైలుకు సురేష్ తరలించారు. టిడిపి కేంద్ర కార్యాలయం పై దాడి కేసుకు సంబంధించి ఈనెల 5వ తేదీన నందిగం సురేష్ ఆరెస్ట్ కాగా, మంగళగిరి కోర్టు ఈనెల 19వ తేది వరకు జ్యూడీషియల్ రిమాండ్ విధించింది.

## అమరావతి రాజధాని దైదిప్యమానంగా వెలుగొందుతుంది

### తాడికొండ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్..



**తుళ్లూరు మేజర్ న్యూస్.** రాజధాని అమరావతి భవిష్యత్తులో దైదీప్య మానంగా వెలుగొందుతుందని తాడికొండ శాసనసభ్యులు శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు

భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం పురస్కరించుకొని మంగళవారం శంకుస్థాపన చేసిన పవిత్ర ప్రదేశం అయినా ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ఎమ్మెల్యే శ్రవణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ యజ్ఞ మహోత్సవ సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కూటమి నేతలు తెలిపారు అమరావతి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో శ్రీ శైవ క్షేత్ర పీఠాధిపతులు శివ స్వామీ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రంగుల. గోపి శ్రీనివాస్ బీజేపీ ఆర్టిజన్ సెల్ కన్వీనర్ బంగారు బాబు , కో కన్వీనర్ డాక్టర్ కోళ్లపూడి హేమ సుందర్ , ఆలూరి యుగేందర్ , మండల టిడిపి అధ్యక్షులు దనేకుల వెంకట సుబ్బారావు, గుంటూరు జిల్లా అధ్యక్షులువనమా నరేంద్ర ,బీజేపీ తాటికొండ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య , బీజేపీ తుళ్లూరు మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ రాజధాని పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు

## నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలి



**తుళ్లూరు మేజర్ న్యూస్.** నులిపురుగులతో చిన్న పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని,పిల్లలు పరిశుభ్రత పాటించక పోవడంతో పురుగులు నోటిద్వారా కడుపులోకి వెళ్తున్నాయని ప్రాధమిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సిహెచ్ఓ) జి వెంకటరమణ అన్నారు.జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక కె వి ఆర్ జెడ్పి హైస్కూల్ లో విద్యార్థులకు అవగాహనా కల్పించారు.చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత,పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత,దోమల నివారణ,మరుగుదొడ్ల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి కమ్యూనిటీ హెల్త్ అధికారి వివరించారు.ఈనెల 17 నుంచి అక్టోబర్2 వరకు స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమం,చేపట్టే అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఎస్ వి ఓ శేషగిరిరావు,స్కూల్ ఉపాధ్యాయులు ఎ శ్రీనివాసరావు,వైద్య సిబ్బంది ఎస్ కె కరీం,ప్రియాంక,ఆశాలు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం: నారా లోకేష్ కు విరాళాలు అందచేత




తాడేపల్లి, మేజర్ న్యూస్: భారీ వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ఉండవల్లిలోని నివాసంలో మంగళవారం విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ను పలువురు ప్రముఖులు, వివిధ సంస్థల నిర్వాహకులు కలిసి విరాళాలు అందజేశారు. ఎస్వీ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీ సీహెచ్.అప్పారావు, రిజిస్ట్రార్ ఎమ్.భూపతి నాయుడు నేతృత్వంలో బోధన, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయ, శాశ్వత ఉద్యోగులు, టైం స్కేల్ ఉద్యోగులు, ఎన్ఎమ్ఆర్ ఉద్యోగులు, టీచింగ్ అసిస్టెంట్స్, పెన్షనర్లు కలిపి రూ.47,46,380 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు పాల్గొన్నారు. ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థులు, బోధనేతర సిబ్బంది ఆధ్వర్యంలో విజయవాడ ముంపు ప్రాంతాల్లో 2వేల మందికి అవసరమైన నిత్యావసర వస్తువులు, బట్టలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రూ.5 లక్షల విరాళం అందజేశారు. అమలాపురానికి చెందిన చెరుకూరి రామచంద్రరావు రూ.5 లక్షల విరాళం అందజేశారు. హైదరాబాద్ కు చెందిన సునీత డిజైనర్ బొటిక్ నిర్వాహకురాలు ఎమ్.సునీత రూ.2,35,000 విరాళం అందజేశారు. గుంటూరుకు చెందిన శ్రీరంగ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు జి.రామస్వామి రూ.1,11,111 విరాళం అందజేశారు. హైదరాబాద్ కు చెందిన పొట్లూరి సాయి నాగార్జున రూ.50 వేలు విరాళం అందజేశారు. విజయవాడ నిడమానూరుకు చెందిన లాల్ బీ రూ.55,555 విరాళం అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన వారందరికీ మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

# మంగళగిరిలో పెద్ద ఎత్తున స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ప్రారంభం



మంగళగిరి, మేజర్ న్యూస్ : మంగళగిరిలో స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత అనే నినాదంతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని ఎంటీఎంసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషాతో కలిసి మంగళవారం ప్రారంభించారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం సందర్భంగా నేతన్న సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించి అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించారు. అనంతరం నేతన్న సర్కిల్ నుంచి టిడ్కో గృహ సముదాయం వరకు సచ్ఛతా హి సేవ ర్యాలీ నిర్వహించారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలకు తాత్కలిక మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందన్నారు. పరిసరాలను పరిశుభ్రం చేసుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నుంచి పరిరక్షించుకోవచ్చని తెలిపారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో జన్మభూమి, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ప్రతి నెల రెండో శనివారం మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలందరిని జన్మభూమి కార్యక్రమంలో భాగస్వాములను చేశారని అన్నారు. జగన్ రాష్ట్రంలో పరిశుభ్రతపై అసలు దృష్టి పెట్టలేదని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో ఎంతో మంది డెంగ్యూ , మలేరియా వంటి వ్యాధులతో చనిపోయారని ఆరోపించారు. ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ఎఫ్ ఆర్టీఐ అవార్డుల పురస్కారం: అత్యున్నత సేవలకు గుర్తింపు



**తుళ్లూరు మేజర్ న్యూస్.** ఫోరమ్ ఫర్ ఆర్టీఐ 2024 కు గాను ఉత్తమ అవార్డులు జాతీయ అధ్యక్షులు ప్రత్తిపాటి చంద్రమోహన్ ప్రకటించారు.ఈ మేరకు అమరావతిలో మంగళ వారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.గత రెండేళ్లుగా (2023-2024 )ఫోరమ్ ఫర్ ఆర్టీఐ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టి సమాచార హక్కు చట్టం, హ్యూమన్ రైట్స్ పై అవగాహన కల్పిస్తున్న వారిని నీతి నిజాయితీ గా ఉన్న వారిని గుర్తించి అవార్డులు అందిస్తామని చెప్పారు. జాతీయ ,రాష్ట్ర,జిల్లా, నియోజక, మండల స్థాయిలలో అవార్డు ఇవబడతాయని తెలిపారు.అవార్డుల పురస్కారం కార్యక్రమం లో రాష్ట్ర ఆర్టీఐ గౌరవ కమిషనర్ లు, మేధావులు పాల్గొంటారని తెలిపారు .ఈ ఏడాది డిసెంబరు నెలలో అవార్డుల పురస్కారం కార్యక్రమం జరుగుతుంది అని చెప్పారు.సెప్టెంబర్,అక్టోబర్, నవంబర్ నెలల్లో కార్యకర్తలు, నాయకులు ఎఫ్ ఆర్టీఐ ద్వారా చేసే సేవ,ఎఫ్ ఆర్టీఐ అభివృద్ధికి చేస్తున్న కృషి నీ కూడా పరిగణన లోకి తీసుకొంటామని కావున నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా పని చేయటానికి సన్నాహాలు చేసుకోవాలని అధ్యక్షులు ప్రత్తిపాటి సూచించారు. ఫోరమ్ ఫర్ ఆర్టీఐ లో వివిధ విభాగాలు యువజన, మహిళా, ఉద్యోగుల, విద్యార్థి, లీగల్ సెల్, మీడియా , రైతు, కార్మిక సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ చొరవ తీసుకోవాలని పిలుపు నిచ్చారు.

## దుగ్గిరాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమమును ప్రారంభించిన అధికారులు .




**దుగ్గిరాల, మేజర్ న్యూస్** .దుగ్గిరాల గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని దుగ్గిరాల మండల అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం దుగ్గిరాలలో నిర్వహించారు. దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయం నందు ఇన్చార్జి ఎంపీపీ షేక్ జబీన్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీసేవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి పోలీస్ స్టేషన్ సమీపం.నకు చేరుకుని మానవహారం నిర్వహించి విద్యార్థుల చే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు .అనంతరం రైలు పేటకు వెళ్లే మార్గంలో మొక్కలు నాటారు .ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటరావు ,మండల జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్ రావు, ఇన్చార్జి ఎంపీడీవో పి. శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పసుపులేటి నాగచైతన్య ,పంచాయతీ కార్యదర్శి శరత్ ,విద్యార్థులు వివిధ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో గూడూరు వెంకటరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం ప్రతి ఒక్కరు బాధ్యత అని అన్నారు .స్వచ్ఛభారత కార్యక్రమం ద్వారా ప్రజలు తమ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, గ్రామ సర్పంచ్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నారై కళాశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం



**మేడికొండూరు మేజర్ న్యూస్:** ఎన్నారై కళాశాలలో జాతీయ నులిపురుగుల దినోత్సవం నిర్వహించారు ఈ సందర్భంగా మేడికొండూరు మండలం మందపాడు ప్రైమరీ హెల్త్ సెంటర్ నుండి చంద్రశేఖర్ సూపర్వైజర్ గారు విచ్చేసి విద్యార్థులకు 19 సంవత్సరంలోపు నిండిన విద్యార్థులకు ఆల్బెండజోల్ 4జి టాబ్లెట్లు అందించారు ఈ సందర్భంగా పిల్లల్లో పరిశుద్ధ ఆహారం జంక్ ఫుడ్స్ వంటి వివిధ కారణాల వలన వార్మ్ ఇన్ఫెక్షన్ ఏర్పడుతుందని కడుపునొప్పి విరోచనాలు గ్యాస్ అలసట బరువు తగ్గటం వంటి లక్షణాలు కనిపించినట్లయితే అవి నులిపురుగులు పేగుల్లో చేరి వీటి ద్వారా పోషకాలు అందంగా విద్యార్థుల్లో రక్తహీనత పాలిపోవడం వంటి గమనించవచ్చని నీరసం ఉత్తేజం గా లేకపోవడం వంటివి కూడా నులిపురుగుల ద్వారా సంక్రమిస్తాయని తెలియజేశారు వీటి ప్రభావానికి అరికట్టవచ్చునని శుభ్రమైన ఆహారం బాగా ఉడికించిన ఆహారం ఆరు బయట మలవిసర్జన వంటి పనుల వలన తెలియజేశారు మందపాడు పీహెచ్ సీ నుంచి ఉషారాణి గారు సుమతి ఆశా వర్కర్ గారు కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్ గారు పాల్గొని విద్యార్థులకు నులు పురుగుల నిరోధక మందులను అందించారు

## పెదకాకాని శివాలయములో "స్వచ్ఛత-హీ సేవ" 2024

**పెదకాకాని మేజర్ న్యూస్ :** భారత ప్రభుత్వము ప్రతిష్ఠాత్మకము చేపట్టిన "స్వచ్ఛత–హీ సేవ" 2024 కార్యక్రమములో భాగముగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, దేవదాయ ధర్మదాయశాఖ కమీషనరు ఆదేశముల ప్రకారము ది.17.09.2024 నుండి ది.02.10.2024 వరకు దేవస్థానము నందు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి "స్వచ్ఛత–హీ సేవ" కార్యక్రమములో భాగముగ ఆలమయు నందు మొదటి రోజు దేవాలయము నందు నంది మండపము, ముఖ మండపము, సీలింగ్ మరియు ఫ్లోరింగ్, గోడలు, సీలింగ్ ఫ్యానులు, ప్రధాన దేవాలయము శ్లాబ్ పై భాగము శుభ్రపరచుట జరిగినది. మరియు అన్నదాన భవనము మరియు పొంగలి భవనము ఎదురు ఖాళీ ప్రదేశము నందు మొక్కలు నాటినట్లు ఆలయ ఉపకమీషనరు డి.శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు.

# నాణ్యమైన లిక్కరు.. కారు చౌక..

లిక్కర్ ధీరులను ఆకట్టుకునే రీతిలో ఇచ్చిన హామీలను నెరవేర్చి.. ప్రభుత్వ ఖజానాను నింపే క్రతువును కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. మరో పదిహేను రోజుల్లో.. మన మందు బాబులు ఇష్టమైన బ్రాండ్లు బ్రాందీ, విస్కీ, బీర్, రమ్మును గటగటా గుటకేసే రీతిలో కొత్త పాలసీ దాదాపు ఖరారైంది. మద్యం ప్రియులకు అత్యంత ప్రీతిపాత్రమైన బ్రాండెడ్ కంపెనీల లిక్కర్ ను అందుబాటులోకి టీడీపీ ప్రభుత్వం తీసుకు వస్తోంది. ఈ మేరకు కంపెనీ ప్రతినిధులతోనూ చర్చలు జరిగాయి. ధరల పైన.. కొత్త ఫార్ములా పైన నిర్ణయానికి వచ్చారు. అదే సమయంలో మద్యం దుకాణాలను ప్రయివేటు వ్యక్తులకే అప్పగించనుందని సమాచారం.

**లిక్కరే ఖజానాకు ఆధారం..** సంపద సృష్టికి ఉత్పత్తే ఆధారం. ఉత్పత్తికి పెట్టుబడి, శ్రమే మూలం. ప్రస్తుతం ప్రభుత్వం ఏకైక ఎజెండా సంపద సృష్టి. జనానికి పంపిణీ. కానీ ఇక్కడ పెట్టుబడి లేదు. ఏం చేయాలి..? ఖజానా నింపటానికి ఏకైక మార్గం లిక్కర్ వ్యాపారం. ఈ వ్యాపారాన్ని గత ప్రభుత్వం నేరుగా నిర్వహించింది. ఇక తాజా ప్రభుత్వం పరిస్థితి తట్టుకోలేనిది. ఇటు సూపర్ సిక్స్ పథకాల కోసం రీ షెడ్యూల్ పేరుతో మళ్లీ అప్పుల కోసం తిప్పలు పడుతుంటే.. ఇటు ఏకంగా ప్రకృతి విరుచుకుపడింది. ఈ పేరుతో సూపర్ సిక్స్ కు సెలవు ఇద్దామనుకుంటే.. వరద బాధితులకు పరిహారం చెల్లించాలి. కేంద్రం ఇచ్చే నిధులతో గట్టెక్కుదామనుకుంటే ఎంత వరకు సాధ్యమో అర్థం కాని స్థితి.

**మద్యం పాలసీతోనే ఉపశమనం..**

అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలు దిశగా అడుగులు పడుతున్నాయి. అక్టోబర్ 3 నుంచి వైన్ షాపులు, బార్లల్లో సరికొత్త సంబరాలు జరగనున్నాయి. ఫ్రీ టచ్చింగ్ వన్ ప్లస్ త్రీ ఆఫర్లు రానున్నాయి. ఇప్పటికే ఈ పాలసీ రూపకల్పనకు అన్ని అంశాలను ప్రభుత్వం సమగ్రంగా అధ్యయనం చేసింది. ఇతర రాష్ట్రాల్లో మద్యం పాలసీలు ఏ విధంగా ఉన్నాయి.. ఆ పాలసీ వల్ల ఎదురయ్యే సమస్యలు ఏమిటి.. ప్రయోజనాలు ఏమిటి.. ఇలా అన్నింటిపైనా ఫోకస్ పెట్టింది. ఇకపై కొత్త ఎక్సైజ్ విధానంలో ప్రయివేటు వ్యక్తులకు పాత పద్ధతి వేలంలోనే మద్యం దుకాణాలను అప్పగిస్తుంది. ఇప్పటికే పాలసీ పైన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ పలు అంశాలపై చర్చించింది.

**కారు చౌకగా మేలిమి బ్రాండ్లు,**

ధరలు అమ్మకాలపై బ్రాంది, విస్కీ, బీరుల్లో పాత బ్రాండ్లను తిరిగి ఏపీలో విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. అన్ని నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటుంది. తక్కువ ధరకు మద్యం అమ్మకాలు చేయడంతో పాటు ఆదాయాన్ని పెంచుకునేలా కొత్త ఎక్సైజ్ పాలసీలో కసరత్తును ప్రభుత్వం చేస్తున్నట్లు తెలిసింది. అయిదేళ్ల కాలంలో అందుబాటులో లేకుండా పోయిన ప్రముఖ బ్రాండ్ల మద్యం ఏపీలో తిరిగి అందుబాటులోకి రానుంది. రాష్ట్రంలో ఎంఎన్‌సీ బాండ్లకు పర్మిషన్లు ఇవ్వాలని మంత్రివర్గం ఓ నిర్ణయానికి వచ్చింది. తక్కువ ధర కేటగిరిలో క్వార్టర్ బాటిల్‌ను రూ.80 నుంచి రూ.90 లకే అందించాలని ప్రణాళికలు రచిస్తోంది. వీటిన్నింటినీ పరిశీలించి నూతన మద్యం విధానాన్ని మంత్రివర్గ ఉపసంఘం రూపొందించనుంది. మద్యం విషయంలో అక్రమాలకు తావులేకుండా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తక్కువ ధరలకే నాణ్యమైన మద్యం..అమ్మకాల్లో మెరుగైన విధానం పైన కసరత్తు తుది దశకు చేరింది.

# కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి

**దేవినేని అవినాష్ అండతో చెక్కులు ప్రామిసరీ నోట్లను లాక్కున్నారు.**

**ఆటో నగర్ 5 సెంట్ల స్థలం ఫోర్జరీ సంతకాలతో అమ్మేసుకున్నారు.**

**31వ రోజు మంత్రి నారా లోకేష్ ప్రజాదర్బార్ కు విన్నపాల వెల్లువ**

**ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని మంత్రి భరోసా**



**మంగళగిరి, మేజర్ న్యూస్:** ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కు విన్నపాలు వెల్లువెత్తాయి. మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. మంత్రి నారా లోకేష్ ను స్వయంగా కలిసి తమ సమస్యలను విన్నవించారు. 31వ రోజు ప్రజాదర్బార్ లో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించిన మంత్రి.. వారి నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని, సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

**ఆటో నగర్ 5 సెంట్ల స్థలం ఫోర్జరీ సంతకాలతో అమ్మేసుకున్నారు.**

మంగళగిరి ఆటోనగర్ లో తమ కుటుంబానికి చెందిన 5 సెంట్ల స్థలాన్ని పఠాన్ ఆలీ బాష, పఠాన్ అశోక్ అన్యాక్రాంతం చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని మసీద్ దరియాబి మంత్రి నారా లోకేష్ ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. కుమార్తె వివాహం కోసం తమ స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలను అప్పటి ఆటోనగర్ ప్రెసిడెంట్ ఆలీ బాష వద్ద తనఖా పెట్టి లక్ష రూపాయలు అప్పు తీసుకున్నాం. అనంతరం అప్పు చెల్లించి తమ పత్రాలను తిరిగివ్వాలని కోరాం. ఫోర్జరీ సంతకాలతో తమ స్థలాన్ని ఇతరులకు విక్రయించి ఆలీ బాష, పఠాన్ అశోక్ అన్యాయం చేశారు. దోషులను శిక్షించి తమ స్థలాన్ని అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

**దేవినేని అవినాష్ అండతో చెక్కులు ప్రామిసరీ నోట్లను లాక్కున్నారు.**

తన వద్ద అప్పుగా తీసుకున్న రూ.17 లక్షలను తిరిగి చెల్లించకుండా.. వైసీపీ నేత దేవినేని అవినాష్ అండతో బెదిరిస్తున్నారని ఉండవల్లికి చెందిన కూనపురెడ్డి రమేష్ మంత్రి నారా లోకేష్ ను కలిసి ఫిర్యాదు చేశారు. విజయవాడకు చెందిన బీవీ సుబ్బారెడ్డి తన వద్ద రూ.17 లక్షలు అప్పుగా తీసుకున్నారని, దేవినేని అవినాష్ అనుచరులతో కలిసి తనవద్ద ఉన్న ప్రామిసరి నోట్లను, చెక్కులను బలవంతంగా లాక్కున్నారని వాపోయారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. విచారించి తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

**కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొపెసర్లను రెగుల్యరైజ్ చేయాలి**

యూనివర్సిటీల్లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయడంతో పాటు మినిమమ్ టైం స్కేల్ వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్(కాంట్రాక్ట్) ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గం నుంచి కాక రాష్ట్రవ్యాప్తంగా పలు విజ్ఞప్తులు వచ్చాయి.

# ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్ లో వివిఐటి విద్యార్థి అనిల్ కుమార్



**పెదకాకాని మేజర్ న్యూస్ :** న్యూఢిల్లీలోని ఎన్.సి.సి కరియప్ప పెరెడ్ గ్రౌండ్ నందు సెప్టెంబర్ 1 నుండి 12 వరకూ నిర్వహించిన అల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్ లో పాల్గొన్న వివిఐటి విద్యార్థి, జూనియర్ అండర్ ఆఫీసర్ పోకా అనీల్ కుమార్ను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. ఏపి, తెలంగాణా చెందిన 9గ్రూప్స్ లో గల 538 క్యాడెట్స్ కు నిర్వహించిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్ లో ప్రతిభ కనబరిచి, మూడు ట్రైనింగ్ క్యాంప్లలో శిక్షణ పొందిన అనంతరం గుంటూరు గ్రూప్ 2 ఆంధ్ర ఆర్మడ్ స్క్వాడ్రన్ నుండి సీనియనర్ డివిజన్ విభాగంలో అనీల్ కుమార్ ఎంపిక కాబడినట్లు వివరించారు. ఈ క్యాంప్ నందు నిర్వహించిన పోటీలలో జె.యూ.ఓ. అనీల్ కుమార్ ఫీల్డ్ సిగ్నల్స్ అండ్ జడ్జింగ్ డిస్టెన్స్ నందు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. అనీల్ కూమార్ మాట్లడుతూ థల్ సైనిక్ క్యాంప్ నందు తెలుగురాష్ట్రాలు ఓవరాల్ సెకండ్ ప్లేస్ సాధించగా అందులో నేను ఒక క్యాడెట్ ను కావడం సంతోషకరంగా ఉందని అన్నాడు. రక్షణరంగం, ఆయుధాల వినియోగం గురించి పూర్తిగా ఈ క్యాంప్ నందు తెలుసుకున్నానని తెలిపారు. ప్రకాశం జిల్లా వ్యవసాయ కుటుంబానికి చెందిన అనీల్ ఆర్మి అధికారిగా ఎదుగుటకు కృషి చేస్తున్నాని తెలిపాడు. అనంతరం అనీల్ కుమార్ను ప్రిన్సిపాల్ డా. వై మల్లికార్జున రెడ్డి, అకడమిక్ డీన్ డా. కె.గిరిబాబు, ఈఈఈ విభాగాధిపతి ఏ.వి నరేష్ బాబు, ఎన్.సీ.సీ అధికారులు క్యాప్టెన్ బిబెన్ బాషా, లెఫ్టినెంట్ డా. ఆళ్ల శ్రీవాణి అధ్యపకులు అభినందించారు.

## సిఎం సహాయనిధికి రూ 71 వేలు

**తుళ్లూరు మేజర్ న్యూస్.** వరద బాధితులను ఆదుకునేందుకు సిఎం సహాయనిధికి శాఖమూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రూ 71వేలు అందజేశారు.మంగళవారం గుంటూరులోని నియోజక వర్గ కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ కు చెక్కును అందించారు.చెక్కు అందించిన వారిలో తరిగోపుల సాంబశివరావు, వలపర్ల జ్ఞాన కుమార్తదితరులు ఉన్నారు.



## తుళ్లూరులో స్వచ్ఛత హీ సేవ



**తుళ్లూరు మేజర్ న్యూస్:** రాజధాని అమరావతి మండల కేంద్రమైన తుళ్లూరులో మంగళ వారం స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమం జరిగింది.మండల ప్రజా పరిషత్ కార్యాలయం దగ్గర నుంచి తులసీ థియేటర్ సెంటర్ వరకు మండల ప్రజా పరిషత్, పంచాయతీ,గ్రామ సచివాలయ అధికారులు, సిబ్బంది ఉపాధ్యాయులు,విద్యార్థులు,డ్వాక్రా మహిళలు, పారిశుధ్య కార్మికులు తదితరులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మనవహారంగా ఏర్పడ్డారు.పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత నిస్తామని, ప్లాస్టిక్ వినియోగం కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎంపిడివో శివన్నారాయణ మాట్లాడుతూ,స్వచ్ఛ భారత్ దినోత్సవం ప్రజల భాగస్వామ్యం తో జరగాలని ఆకాంక్షించారు.

## టిడిపి కేంద్ర కార్యాలయం పై దాడి కేసులో 110 మందిని గుర్తించాం.



**మంగళగిరి, మేజర్ న్యూస్:** మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ప్రస్తుతానికి 110 మందిని గుర్తించామని గుంటూరు అర్బన్ ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టిడిపి కార్యాలయంపై దాడి కేసులో నేటికి 24 మందిని అరెస్ట్ చేశామని, 64 మంది జిల్లా కోర్టును అశ్రయించారని, ఈ నెల 26వ తేదిన వాయిదా ఉందని తెలిపారు. 14 మంది హైకోర్టును అశ్రయించగా, 4 గురికి ముందస్తు బెయిల్ వచ్చిందన్నారు. 3గురిని అరెస్ట్ చేశామన్నారు. 7గురిని అరెస్ట్ చేయాల్సిఉందన్నారు. మాజీ ఎంపి నందిగం సురేష్ రెండు రోజుల విచారణ ముగిందన్నారు. టిడిపి కార్యాలయంపై దాడి కేసు విచారణలో నిర్లక్ష్యం వహించిన ఒక సీఐ, ఒక ఎస్ఐ ను సస్పెండ్ చేశామని, విచారణలో పోలీస్ పాత్ర ఉంటే వారిపై కూడ శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. చట్టపరంగా విచారణ జరుగుతుందని, చట్టప్రకారమే చర్యలు తీసుకుంటామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు.

## ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు



**ఫిరంగిపురం మేజర్ న్యూస్:** నవభారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ జన్మదిన సందర్భ ంగా ఫిరంగిపురం మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు శ్రీ విశ్వనాధుని హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఫిరంగిపురం గ్రామంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి ప్రధానమంత్రి గారికి జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా ఒక మొక్కను కూడా నాటారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ఫిరంగిపురం మండలం సభ్యత్వ ఇంచార్జ్ తాడువాయి రామకృష్ణ విచ్చేశారు అనంతరం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా కోశాధికారి రావూరి నారాయణరావు కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరెకుర్తి చంద్రశేఖర్ రెడ్డి మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి రావూరి లక్ష్మీదేవి చాముండేశ్వరి జిల్లా కార్యవర్గ సభ్యులు తిప్పారెడ్డి కాశీ విశ్వనాథరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మనోరంజన్ రెడ్డి, బత్తిన సుబ్బారావు గారు చదలవాడ శ్రీనివాసరావు, కిరీటి శ్రీనివాసరావు,నరసింహారావు చిన్నప్ప, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఏపీ సీఆర్డీఏ కమిషనర్ ను కలిసిన రైతు నాయకులు

**తుళ్లూరు మేజర్ న్యూస్:** ప్రజా రాజధాని అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పరచే వివిధ ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన భూమిని భూ సమీకరణ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ)కు ఇచ్చేందుకు రైతులు సుముఖంగానే ఉన్నారు. దీనిని పురస్కరించుకొని మంగళవారం నాడు రైతు నాయకులు విజయవాడలోని ఏపీ సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో సంస్థ కమిషనర్ శ్రీ కాటంనేని భాస్కర్ ఐఏఎస్ వారిని కలిశారు. రైతు నాయకుల్లో ఒకరైన మల్లెల శేషగిరిరావుతో కలిసి ఉండవల్లి, పెనుమాక, అనంతవరం, మల్కాపురం గ్రామాలకు చెందిన రైతులు కమిషనర్ వారిని కలిసి తమ భూములను భూ సమీకరణ పథకానికి ఇచ్చే విషయమై చర్చించారు. గతంలో ఎదుర్కొన్న చిన్న చిన్న సమస్యలు పరిష్కరిస్తే మరింత మంది ముందుకొస్తారని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ వారంలో ప్రతి శుక్రవారం అదనపు కమిషనర్ తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, రాజధాని అన్ని గ్రామాల్లో రైతులతో సమావేశమై వారి వ్యక్తిగత సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

## సత్తెనపల్లి డిఎస్పీగా హనుమంతరావు..



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** సత్తెనపల్లి డిఎస్పీ గా మెదరమెట్ల హనుమంతరావు మంగళవారం విధుల్లో చేరారు. 1991 ఎస్ఐ బ్యాచ్‌కి చెందిన ఈయన సత్తెనపల్లి, గుంటూరు కొత్తపేట, పెద్దకాకాని, నరసరావుపేట, పిడుగురాళ్ల స్టేషన్లలో ఎస్ఐ గా పని చేశారు. అదేవిధంగా సీఐగా పిడుగురాళ్ళ, గుంటూరు లాలాపేట, అమరావతి నెల్లూరు జిల్లా గూడూరులో పని చేశారు. మూడేళ్ల క్రితం డిఎస్పీగా పదోన్నతి పొందిన ఈయన సాధారణ బదిలీపై సత్తెనపల్లి డీఎస్పీగా విధులు నిర్వర్తించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హనుమతరావు మాట్లాడుతూ అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడిన అదేవిధంగా ఏ పార్టీ గొడవలకు దాడులు జరిగిన పేకాట, కోడి పందాలు, వంటి జోదగాళ్ళను ఎంతటి వారైనా సరే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

## లోక కళ్యాణం కోసమే అనంత పద్మనాభ స్వామి వ్రతం



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** పెదకూరపాడు మండల పరిధిలోని 75 తాళ్లూరు అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో మంగళవారం అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు గాయత్రీ మాత ఉపాసకులు అంకారావు మాస్టారు పాల్గొని భక్తులచే వివిధ రకాల పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లోక కళ్యాణ కోసమే ఈ అనంత పద్మనాభ స్వామి వ్రతం నిర్వహించుకోవడం జరుగుతుందని భక్తిశ్రద్ధలతో ఎవరైతే ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొని వ్రతం నిర్వహిస్తారో ఆ గ్రామంలో ఆయా కుటుంబాలలో పాడి పరిశ్రమ ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని అన్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ నిర్వాహకులు తాటి కోటేశ్వరమ్మ రామకృష్ణ సుబ్బారావు సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పోటాపోటీగా డాన్స్ బేబీ డాన్స్ పోటీలు




**మాచర్ల, మేజర్ న్యూస్ :** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని స్థానిక శ్రీ సీతారామ గణేష్ సేవా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్ పోటీలు పోటా పోటీగా జరిగాయి. ఈ పోటీల్లో మాచర్ల పట్టణంలోని వివిధ ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలకు చెందిన 25 టీములు పాల్గొన్నాయి. భరతనాట్యం, కూచిపూడి నృత్యాల ప్రదర్శన, పాత,కొత్త సినిమా పాటలకు డాన్స్ వేసి భక్తులను ఆకట్టుకున్నారు. మొదటి బహుమతి రూ5 వేలు శ్రీ కృష్ణ హాస్పిటల్ అధినేత డాక్టర్ గుర్రం రాజశేఖర్ రెడ్డి, రెండవ బహుమతి రూ 3వేలు కృష్ణవేణి కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటరామయ్య, మూడో బహుమతిరూ 2వేలు శ్రీ కృష్ణ ఆర్థోపెడిక్ డాక్టర్ హరికృష్ణ అందజేశారు.ఈ పోటీలను తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావడంతో దేవాలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఒరుగంటి పురుషోత్తం, ఒరుగంటి చెన్నకేశవరావు, వాసవి దత్, నాగరాజు,భార్గవ్, చంద్ర పట్ల సాయి, పులక సాయి, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవ మానవహారం

**వినుకొండ, మేజర్ న్యూస్ :** మండల కార్యాలయము నందు స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా మండల కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీ సర్పంచులకు వివిధ శాఖల అధికారులకు స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత అవగాహన కల్పించడం అయినది స్వచ్ఛతాహి సేవ సమావేశం నిర్వహించిన అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేయడమైనది. కార్యక్రమంలో ఈవోపీఆర్డి సుందర్ రామిరెడ్డి మాట్లాడుతూ మీ మీ గ్రామాల్లో మీకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారము కార్యక్రమం నిర్వహించి ఫొటోస్ ను వీడియోని అప్లోడ్ చేయాలని బ్రదక పంచాయతీ కార్యదర్శి మన 26 గ్రామపంచాయతీలలో రోజుకు ఒక కార్యక్రమం నిర్వహించి ఫొటోస్ అప్లోడ్ చేయాలని అట్లా చేయని యెడల చర్యలు తీసుకొనబడును అని అన్నారు (ఎస్ హెచ్ ఎస్) స్వచ్ఛభారత్ మిషన్ సైట్ లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలి సైట్ తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని తెలియజేశారు. ఎం ఆర్ సి ప్రభాకర్ రావు, పంచాయతీ కార్యదర్శులు సర్పంచులు వివిధ శాఖల అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అద్భుత సృజనాత్మకతకు ఆద్యుడు విశ్వకర్మ

### జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వెల్లడి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**



అద్భుత సృజనాత్మకతమైన కళలకు , సమస్త సృష్టికి ఆద్యుడు, అధిపతి విశ్వకర్మ భగవానుడు అని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో జరిగిన భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తో కలిసి పాల్గొన్నారు. మొదటగా భగవాన్ శ్రీ విరాట్ విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి వందనాలు సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ స్వయం భూ అయిన భగవాన్ విశ్వకర్మ పూర్వ కాలంలో దేవతలు, దేవుళ్ళకు నివాస ప్రాంతాలు, స్వర్గం, రథాలు, ఆయుధాలు రూపొందించే వారని వేదాల్లో, పురాణాలలో వుందన్నారు. సృజనాత్మకత వున్న ప్రతి ఒక్కరికీ భగవాన్ విశ్వకర్మ ఆరాధ్యుడు అన్నారు. భగవాన్ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించుకోవడం జరుగుతున్న దన్నారు. భారత ప్రభుత్వం పి.యం విశ్వకర్మ పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. అనేక వృత్తుల వారికి ఇందులో భాగంగా గుర్తింపు కార్డులు ఇవ్వడం జరుగుతుందని , దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి అర్హత వున్న వారికి పనిముట్లు అందించడం జరుగుతుందని , అలాగే దరఖాస్తుదారులు కోరిన మేరకు వారికి వివిధ వృత్తుల్లో వృత్తి నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు అందించడం జరుగుతుందన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పంచాయితీ, మండల స్థాయిలో స్క్రూట్నీ చేసి జిల్లా స్థాయి కమిటీకి పంపడం జరుగుతుందని , జిల్లా కమిటీలో దరఖాస్తులు పరిశీలించి అర్హత మేరకు వివిధ రకాల శిక్షణ ఇవ్వడంతో పాటు 15 వేల రూపాయల విలువ గల పనిముట్లు అందించడం జరుగుతుందన్నారు. నామినల్ వడ్డీ 5 శాతం తో లక్ష రూపాయల ఋణాన్ని 18 నెలల్లో చెల్లింపు చేసే విధంగా అందించడం జరుగుతుందన్నారు. ఆయా వృత్తుల్లో వారు మరింత సామర్థ్యాన్ని పెంపొందించుకొని ఆర్థికంగా బలోపేతం చేయడం జరుగుతుందన్నారు. పియం విశ్వకర్మ పథకానికి అర్జీలు పెట్టుకోవడానికి చివరి తారీఖు అంటూ ఏదీ లేదని ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ మయూరి, మధుసూధన రావు, పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుధాకర్ , గ్రౌండ్ వాటర్ డిప్యూటీ డైరెక్టర్ వందనం, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆరధినేటర్ విజయ లక్ష్మీ , డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమా దేవి, విశ్వకర్మ సాధన సమితి పార్లమెంటరీ కన్వీనర్ జి. నాగేశ్వర రావు , గుంటూరు విశ్వకర్మ పీఠాధిపతి యోగిమహేశ్వరానంద విశ్వ సంకీర్తనాచార్య తుర్లపాటి శాంభయ్యాచారులు , కాజా భరద్వాజ అడ్వకేట్ , సిహెచ్. రాజ్యలక్ష్మీ , స్టేట్ మహిళా ప్రెసిడెంట్ అంగళ్లకుదుటి సుశీల తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాలపై అవగాహన సదస్సు : ఎంపీపీ, జడ్పిటిసి




**మాచవరం, మేజర్ న్యూస్ :** స్వచ్ఛతాహి సేవ 2024 పక్షోత్సవాలపై మాచవరం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఇన్చార్జి ఎంపీడీవో ప్రసాద్ అధ్యక్షతన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు,పంచాయతీ కార్యదర్శులకు ప్రజాప్రతినిధులకు,అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో ఇంచార్జ్ ఎంపీడీవో ప్రసాదు మాట్లాడుతూ, ఈ యొక్క కార్యక్రమం ముఖ్య ఉద్దేశం స్వభావ్ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత అంటే ప్రతి వ్యక్తి స్వభావంలో స్వచ్ఛత గా ఉండాలని సంస్కార్ స్వచ్ఛత అంటే పరిసరాలను మన ఊరిని స్వచ్ఛంగా ఉంచుకోవాలని మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి, మన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని తెలియజేయుచు సెప్టెంబర్ 17వ తేదీ నుండి ప్రతిరోజు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించు కోవాలని, మరియు ఈ పక్షోత్సవాలలో శానిటేషన్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ పై పిల్లలకు అవగాహన కల్పించాలని, తడి పొడి చెత్తను గ్రామాలలో వేరువేరుగా సేకరించి ఎస్ డబ్ల్యూ యు పి సి షెడ్లకు తరలించాలని, సైడ్ కాలువల పూడికలు తీయటం, గ్రామాలలో రోడ్లు వెంబడి చెత్త కుప్పలను తొలగించడం, త్రాగునీటి వనరులను సక్రమంగా వినియోగించుకోవడం, గ్రామాలలోని నీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేయించడం, వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. ఎంపీపీ దారం అంబులమ్మ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉండగలు గుతామని ఆయన అన్నారు. జడ్పిటిసి జె .శివ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాలన్నారు. ఈనెల 17 నుండి అక్టోబర్ రెండు వరకు జరిగే ప్రతి కార్యక్రమం గ్రామపంచాయతీలో ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు అధికారులు నాయకులు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో మాచవరం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాగిడి నరేష్, యు .ఓ.ఆర్. డి డి .వెంగళరావు, పంచాయతీరాజ్ ఏ.ఈ వెంకటేశ్వర రెడ్డి, మండల కో ఆప్షన్ మెం బర్ షేక్ మహమ్మద్ జానీ, టిడిపి మండల మాజీ అధ్యక్షులు ఎడ్లపల్లి రామారావు, మాజీ ఎంపీటీసీ చల్లపల్లి నరసింహారావు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు పునులూరి రామయ్య, ఆర్యవైశ్యుల టిడిపి సీనియర్ నాయకులు చిటిప్రోలు నరసింహారావు, వంకాయల హరీష్, మాచవరం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయులు పెంటూ బుడే సాహెబ్, ఉపాధ్యాయులు కావాటి. కోటేశ్వరావు ఈ విధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరం..




**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** స్థానిక నరసరావుపేట పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ "రక్తదానం చేయండి – ప్రాణదాతలు కండి" అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రస్తుత రోగుల అవసరాలకు తగినంత రక్తం బ్లడ్ బ్యాంకులలో ఉండడంలేదని, రక్తాన్ని తయారుచేసే ఫ్యాక్టరీలు లేవు కనుక రక్తదాతల సంఖ్య పెరగాలని అందుకు యువత ముందుకు రావాలని అన్నారు. ఒక రక్తదాత ఇచ్చిన రక్తం ద్వారా నలుగురి ప్రాణాలు కాపాడగలరని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండి ఆరోగ్య భారత నిర్మాణానికి పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ బీజేపీ అధ్యక్షులు రంగిశెట్టి రామకృష్ణ, సింధు విద్యాసంస్థల అధినేత రామకృష్ణ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు కెవి జగన్మోహన్ రెడ్డి, కిరణ్, శరత్, గుప్తా, రోటరీ క్లబ్ ప్రతినిధులు విచ్చేసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు తెలిపారు. కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతుడే రక్తదాత అని, రక్తదానం చేయడం ఒక మంచి అలవాటని, ఈ శిబిరంలో 35 మంది విద్యార్థులు రక్తదానం చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారని, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ యూనిట్ కో ఆర్డినేటర్స్ మరియు ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు రక్తదానం చేశారని, అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరమైన వారికి మా కళాశాల విద్యార్థులు రక్తదానం చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన 35 మంది విద్యార్థులను కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్నేపల్లి క్రిష్ణకిషోర్, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# గుంటూరులో ఘనంగా స్వచ్ఛతాహి ప్రతిజ్ఞ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

స్వచ్ఛతహి సేవాలో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మంగళవారం తెల్లవారు జామున 5:30 గంటల ప్రజారోగ్య కార్మికుల మస్టర్ పాయింట్స్, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో, వార్డ్ సచివాలయాల్లో ప్రజలు, ప్రజాప్రతి నిధులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత భాగస్వామ్యంతో షుమారు 1.25 లక్షల మందితో స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞ చేపట్టామని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛత హి సేవా ప్రతిజ్ఞను చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవాలో పాల్గొనడం ద్వారా గుంటూరు నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దుకోవడంలో భాగస్వాములు కావడమేనన్నారు. నగరంలో ఈ నెల 17 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు ప్రజలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో స్వచ్ఛత హి సేవా



కార్యక్రమాలు నిర్వహించనున్నామని, కార్యక్రమాల వారీగా విధులు కేటాయించబడిన అధికారులు అంకిత భావంతో పని చేయాలన్నారు. నగరంలో ఈనెల 17న ప్రజలు, వివిధ సంస్థల భాగస్వామ్యంతో స్వచ్ఛ ప్రతిజ్ఞ, 18న పార్క్స్, పబ్లిక్ ప్రాంతాలు శుభ్రం, ప్రజారోగ్య కార్మికులకు ప్రథమ చికిత్సపై శిక్షణ, కార్మికులకు వైద్య శిబిరాలు, బ్లీచింగ్, దోమల నివారణ మందులు పిచికారీ, నీరు నిలిచిపోయే ప్రదేశాలను శుభ్ర పరచడం, 19న ప్రతి ఒక్కరూ ఈ రోజు సైకిల్ వినియోగించడం, వార్డ్ సభలు, మెగా క్లీన్ కార్యక్రమం, వెంట్ పైప్ లకు నైలాన్ నెట్ల ఏర్పాటు, 20న ప్లాంటేషన్ డ్రైవ్, 21న కాలుష్య రహిత నగర సాధనపై విద్యార్ధులకు పెయింటింగ్ పోటీలు, రోడ్ పక్కన ఉండే డస్ట్ తొలగింపు, స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ చేపట్టడం జరుగుతుందన్నారు. 22న రూఫ్ టాప్ గార్డెనింగ్ పై అవగాహన, శుభ్రం, పార్క్ ల నిర్వహణ, 23న విద్యార్ధులకు వాయు కాలుష్యం పై వ్యాసరచన పోటీలు, డిబేటింగ్, ప్రజారోగ్య కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు మెడికల్ క్యాంప్ లు, 24న సైక్లాథాన్, గాలి కాలుష్యం పై నాటికలు, డ్రైన్ల పూడికతీత, 25న స్వచ్ఛందంగా ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొనడం, దేవాలయాలు శుభ్రం, ఫాగింగ్, 26న మొక్కలు నాటడం, రోడ్ మీడియన్స్, ఫుట్ పాత్ ల శుభ్రం, ప్రజారోగ్య కార్మికులకు హెల్త్ ఇన్సూరెన్స్, 27న వ్యర్ధాలను వేరు వేరుగా విభజన చేయడంపై విద్యార్ధులకు అవగాహన, రోడ్ల ఆక్రమణల తొలగింపు, 28న మానవహారం, 29న నగరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి అభినందన సభ, ముఖ్యమైన అతిధుల ఉపన్యాసం, వీధి నాటికల ప్రదర్శన, 30న వ్యర్ధాల నిర్వహణపై ప్రజలకు అవగాహన, నీరు నిలిచిన ఖాళీ స్థలాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, 1 అక్టోబర్ న స్వచ్ఛత హాయ్ సేవా కాన్సెప్ట్ పై విద్యార్ధులతో మానవహారం, వాయు కాలుష్య నియంత్రణపై వీధి నాటికల ప్రదర్శన, కమర్షియల్ మార్కెట్స్ మాస్ క్లీనింగ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. నోడల్ అధికారుల వారీగా ఆయా కార్యక్రమాల్లో స్తానిక ప్రజా ప్రతినిధులను, సిబ్బందిని భాగస్వాములను చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్,శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్.ఈ. శ్యాం సుందర్, ఎంహెచ ్ఓలు మధుసూదన్, రామారావు, మేనేజర్ ప్రసాద్, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు పశ్చిమలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడండి : ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రోజు రోజుకి ట్రాఫిక్ పెరిగిపోతున్నదని, దీనిని క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ ట్రాఫిక్ సిఐ సింగయ్యను ఎమ్మెల్యే గల్లా మాధవి ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఐతో సమావేశం నిర్వహించి, అరండల్ పేట మరియు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటుందని, ట్రాఫిక్ సిగ్నల్స్ సరిగ్గా పని చేయడం లేదని సిఐ దృష్టికి ఎమ్మెల్యే తీసుకుని వచ్చారు. చుట్టుగుంట సమీపంలోని విఐపి రోడ్డులో హెవి లోడ్ తో లారీలు తిరుగుతున్నాయని, దీని వలన ట్రాఫిక్ జామ్ మరియు ప్రమాదాలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చినదని, దీనికి పరిష్కార మార్గాలు చూడాలని ఎమ్మెల్యే కోరారు. అరండల్ పేట సండే మార్కెట్ జరుగు ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు అధికంగా ఉన్నాయని అటు చిరువ్యాపారులకు, ప్రజలకు ఇబ్బందులు లేకుండా పరిష్కార మార్గం చూడాలని సిఐని ఆదేశించారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** కాటూరి హాస్పిటల్స్ వారి సహకారంతో అమరావతి మండలం అత్తలూరు గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం కాటూరి హాస్పిటల్స్ వారి సహకారంతో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్నికాటూరి మెడికల్ హాస్పిటల్ డాక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 370 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాగులూరు ఫౌండేషన్ ప్రతినిధులు మాగులూరి కృష్ణారావు, కుంచనపల్లి కిరణ్, కొండవీటి ప్రసాద్, కాంద్రు పద్మలత కుమారి మరియు బెల్లంకొండ దాసయ్య మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుక

**మాచర్ల ప్రతినిధి, మేజర్ న్యూస్ :** భారత ప్రధాని నరేంద్ర మోడీ 74వ జన్మదిన వేడుకమాచర్ల పట్టణంలో బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి హాజరయ్యారు. ముందుగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం ఎంతో పురోగతి సాధించిందని అన్నారు. ప్రతి ఏడాది దేశ జిడిపి ఏడు శాతం పైగా సాధించడం మోడీ పాలనకే సాధ్యమన్నారు. ప్రధాని ప్రవేశపెట్టిన ఎన్నో పథకాల వల్ల దేశంలోని బడుగు బలహీన వర్గాలు ఆర్థిక అభివృద్ధి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల పట్టణ అధ్యక్షులు ఓర్సు క్రాంతికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కూని శెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కో ఆప్షన్ కన్వీనర్ బొగ్గవరపు మస్తాన్ రావు, కో కన్వీనర్ పోకూరి కాశీపతి, మాచర్ల పట్టణ ప్రధాన కార్యదర్శి ఏచూరి సురేష్, మండల అధ్యక్షులు సన్నాయిల బ్రహ్మం, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి భక్తుల రాంబాబు, యువ మోర్చా పట్టణ అధ్యక్షుడు మారం వంశీకృష్ణ, ఓబీసీ నాయకులు ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, జేవిశెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీవో 115 రద్దు చేయాలంటూ స్టాఫ్ నర్సుల ధర్నా



**మాచర్ల మేజర్ న్యూస్ :** ఏఎన్ఎంలను స్టాఫ్ నర్సులుగా రెగ్యులర్ ప్రాతిపదికన నియమిస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవో 115 రద్దు చేయాలంటూ ప్రభుత్వ వైద్యశాల స్టాఫ్ నర్సులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా కాంట్రాక్టు స్టాఫ్ నర్సులుగా పనిచేస్తున్నాం. తక్కువ జీతాలకే అంకితభావంతో పనిచేస్తున్నాం. జీతాలు పెంచలేదు. కరోనా సమయంలో కూడా కుటుంబాలకు దూరంగా ఉండి ప్రజలకు సేవలందించాం. మా సేవలకు గుర్తింపుగా రాష్ట్ర స్థాయిలో అవార్డుతో గుర్తింపునిచ్చారన్నారు. అలాంటి మా ఉద్యోగాలను తీసి వేరొకరికి ఇవ్వడం భావ్యం కాదన్నారు. ఇప్పుడు పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని కోరుతున్నాము. మాకు అన్యాయం చేస్తూ మా పోస్టుల్లో ఏఎన్ఎంలను రెగ్యులర్ స్టాఫ్ నర్సులుగా నియమిస్తున్నారు. దీనివల్ల మాకు అన్యాయం జరుగుతుంది. ఎఎన్ఎంలకు 18 నెలలు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణనిచ్చి వారికి జీఎన్ఎంలుగా అర్హత కల్పించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న వారిని కూడా ఈ పోస్టుల్లో నియమిస్తున్నారన్నారు. వారికి ఉద్యోగాలు కల్పించాలనే ఉద్దేశంతో 115 జీవో ద్వారా మా పోస్టుల్లో వారిని రెగ్యులర్ ప్రాతిపదికన నియమిస్తున్నారు. మాకు అన్యాయం చేస్తున్నారు. గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నా మాకు తక్కువ జీతం ఇస్తూ, ఎలాంటి అలవెన్సులు లేకుండా ఫిక్స్ వేతనాలతో పనిచేస్తున్నాం. మాకు అన్యాయం జరుగుతుంది. ఈ అన్యాయాన్ని అరికట్టాలి. నోటిఫికేషన్ ఇచ్చి పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని కోరుతున్నాం. మా సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతోనే ధర్నాలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డా? ఎ. ఉదయభానును కలిసి వినతిపత్రం అందజేశారు. వైద్యులు స్టాఫ్ నర్సులకు మద్ధతుగా ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. 115 జీవో రద్దు చేయాలని, తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు.

## అక్టోబర్ 1 నుండి "స్వచ్ఛ త హీ సేవ"




**నూజెండ్ల, మేజర్ న్యూస్ :** మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్వాడి సూపర్వైజర్లకు మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఈవోపీఆర్డీ రవికుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి అక్టోబర్ 1వ తేది వరకు 15 రోజుల పాటు ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దీనిలో భాగంగా శానిటేషన్, అవేర్నెస్ ప్రోగ్రామ్స్, స్కూల్స్ అంగన్వాడీలులో పిల్లలకి అవగాహన కల్పించడం, తడి చెత్త, పొడి చెత్త గురించి ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించడం, విషజ్వరాలు, అంటువ్యాధులు రాకుండా అవగాహన కల్పించడం, మంచినీటి వనరులను సక్రమంగా ఉపయోగించు కోవడం త్రాగునీటిని క్లోరినేషన్ చేయటం, గ్రామ సభలు నిర్వహించటం ద్వారా గ్రామాలని పరిశుభ్రమైన గ్రామాలుగా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో అందరితో ప్రతిజ్ఞ చేయించి అందరూ కార్యక్రమంలో భాగస్వాములు చేయటం ఈ కార్యక్రమం ఉద్దేశం. కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు జడ్డా సుబ్బులు రామయ్య, డిడబ్ల్యులెస్సి కన్సల్టెంట్ పల్నాడు జిల్లా రమేష్, మండల విద్యాశాఖ అధికారి నలబోలు రవిచంద్ర, స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ కంచర్ల సుబ్బరామయ్య, ఐటిసి- అసిస్ట్ శ్రీనివాస రావు, హనుమంతరావు పాల్గొన్నారు.

# ఘనంగా వావిలాల జయంతి వేడుకలు



**సత్తెనపల్లి, మేజర్ న్యూస్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర గాంధీ, పద్మభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య 118 వ జయంతి సందర్భంగా సత్తెనపల్లి పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, డిఎన్ఆర్ ఫౌండేషన్ అధినేత దరువూరి నాగేశ్వరరావు, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి సాంబశివరావు, జన చైతన్య వేదిక అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణ్ రెడ్డి,గుంటూరు ఏఎంసి మాజీ చైర్మన్ నిమ్మకాయ రాజనారాయణ, డాక్టర్ శ్రీధర్, వావిలాల కుటుంబ సభ్యులు లీలా మహేశ్వరి, వావిలాల సత్యం, వావిలాల రమ, మన్నవ సోడేకర్, పలు రాజకీయ పార్టీల నేతలు, వావిలాల వారి అభిమానులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర సమరోద్య మంలో వావిలాల వారి పాత్ర చిరస్మరణీ యమని కొనియాడారు. స్వాతంత్రం అనం తరం రాజకీయాల్లో కూడా ఆయన నాలుగు సార్లు సత్తెనపల్లి నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందడం విశేషంగా చెప్పుకోవాలన్నారు. ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపిన నాయకుడు వావిలాల అని గుర్తు చేసుకున్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్న ఆయన ఆశయాలు, ఆలోచనలు చాలా గొప్పవని అన్నారు. నిజాయితీ, నిరాడంబరత, నిస్వార్ధ సేవ,నేటి యువతరం స్ఫూర్తిగా తీసుకొని ముందుకి నడవాలి అన్నారు.

## పర్యాటక అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**గుంటూరు, మేజర్ న్యూస్ :** సెప్టెంబర్ 27 ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని 2023–24 కు గాను ప్రకటించిన వివిధ అవార్డులకు అర్హులైన పర్యాటక సంబంధిత రంగాల నుండి దరఖాస్తులను ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆహ్వానిస్తున్నట్లు జిల్లా టూరిజం అధికారి ఎ శ్రీ రమ్య మంగళవారం. ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా మాదిరిగానే మొత్తం 38 విభాగాల నుండి 41 అవార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని చెప్పారు. దరఖాస్తులను ఏపీ టూరిజం వెబ్సైట్ www.aptourism.gov.in నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని, పూర్తి చేసిన వాటిని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ ఫ్లోర్, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడలో ఈనెల 22వ తేదీ లోపు అందజేయాలని కోరారు. ఈ నెల 27న అవార్డుల పంపిణీ కార్యక్రమం ఉంటుందన్నారు.

## చిన్న షిరిడీలో దేవి శరన్నవరాత్రులు



**వినుకొండ, మేజర్ న్యూస్ :** దసరా నవరాత్రులను పురస్కరించుకుని పూజ్యశ్రీ హిమాలయ గురూజీ ఆశీశులతో శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో వినుకొండ విట్టంరాజుపల్లి చిన్న షిరిడీ, సాయి బృధవనంలో దేవి శరన్నవరాత్రుల పూజలు 9 రోజుల పాటుగా నిర్వహిచనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. గతంలో కాకుండా ఈసారి నిర్మాణంలో ఉన్న శాంతి ఆశ్రమంలోని మండపంలో ఉత్సవ మూర్తులతో విగ్రహాలకు దేవి శరన్నవరాత్రుల పూజలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజశ్యామల యాగం..తో పాటుగా ప్రతిరోజు పుష్ప అలకరణ..అభరణ అలకరణ పూజలు చేస్తున్నట్లు తెలిపారు. వాతావరణ మార్పుల వర్షాల ప్రభావం నేపథ్యంలో నిర్మాణంలోన్న ఆశ్రమంలో చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మరి ముఖ్యంగా పూజలు పూర్తయ్యే వరకు పూజ్యశ్రీ హిమాలయ గురూజీ నిరహరి గా మౌనవ్రత దీక్షలు తొమ్మిది రోజులపాటు ఉండనునట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరలను కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ రోజు వెల్లడించనున్నట్లు వివరించారు. ట్రస్ట్ చైర్మన్ పెండ్యాల మోహన్ రావు సెక్రటరీ కన్నెగండ్ల కోటేశ్వరరావు, పెండ్యాల పుల్లారావు . పెండ్యాల కాశి, కొప్పురావూరి సుధాకర్, సత్యం, రమేష్ ,మునిరెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

## హసన్నాయుని పాలెం స్వచ్ఛత హి సేవ



**వినుకొండ, మేజర్ న్యూస్ :** మండలం లోని హసన్నాయుని పాలెం స్వచ్ఛత హి సేవ 2024లో భాగంగా నిర్ణయించిన ప్రకారం సి టి యు దగ్గర మానవహారము వేయించడమైనది. కార్యక్రమంలో స్వచ్ఛత హి సేవ ఒక అంశంగా స్వీకరించి ఉత్సాహమంతమైన ప్రజాస్వామ్య నాయకత్వ నిర్మాణం స్వచ్ఛతహి సేవ ద్వారానే జరుగుతుందని తెలియజేశారు. స్కూలు ఆవరణంలోని సామూహిక పరిశుభ్రత ఎట్లా ఉందును తెలియజేస్తూ వారసత్వ వ్యర్థ స్థలాలను గుర్తించి శుభ్రపరచమని ఆదేశించారు ఈ ప్రోగ్రాం అక్టోబర్ 1 వరకు నిర్వహించి రెండవ గాంధీ జయంతిని ఒక పండుగ వాతావరణంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో కె మంగమ్మ, వీరాంజనేయులు పంచాయతీ కార్యదర్శి షేక్ జానీ బాషా, సిహెచ్ ప్రమీల, ఆశ వర్కర్ పద్మ, మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ రావు, షాబిరుణ్ టీచర్, విద్యార్థిని విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



**వినుకొండ, మేజర్ న్యూస్ :** నరసరావుపేట రోడ్డు ఎన్. ఎస్. పి. కాలనీ గ్రౌండ్ నందు వినుకొండ నియోజకవర్గం విశ్వబ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం బ్రహ్మశ్రీ కడియాల అంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో ఉదయం 5:30 కు ప్రారంభం, 7 గంటలకు సుప్రభాత సేవ, ఎనిమిది గంటలకు విశ్వకర్మ పతాకావిష్కరణ 9 గంటలకు భగవాన్ విరాట్ విశ్వకర్మ పూజ కార్యక్రమం 10 గంటలకు పంచకుండాఆత్మక శ్రీ విశ్వకర్మ యజ్ఞం 12:30 నిమిషాలకు నివేదన మంగళహారతి, విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. లోక కళ్యాణ అర్థం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక విశ్వకర్మ పూజలు నిర్వహించారు .అనంతరం మక్కెనను దుశ్యాలవలు పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆది గురువు శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ సృష్టికి మూలం అని పరమాత్మ విశ్వకర్మ 5 ముఖాలతో పది చేతులతో స్వయంభుగా అవతరించిన రూపం వీరిది దృష్టి కలిగిన అమిత శక్తి కలవాడు మహాభారతము ఈయనను వేయి కలలకు అధినేతగా అభివందించిందని అన్నారు అనంతరం అన్నసంతర్పణ పూజలు కొబ్బరికాయ కొట్టి , పూజలు నిర్వహించి , ప్రారంభించారు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాంజనేయరెడ్డి డి. కొండచారి, రెడ్డి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ రైతు సేవా కేంద్రం సిబ్బంది నైపుణ్య పెంపుదలపై శిక్షణ

### శాస్త్రవేత్త సైదా నాయక్




**మాచవరం, మేజర్ న్యూస్ :** మాచవరం మండలంలోని ఎంపీడీవో ఆఫీసులో పిడుగురాళ్ళ సబ్ డివిజను రైతుసేవా కేంద్ర సిబ్బంది నైపుణ్య పెంపుదలపై శిక్షణా కార్యక్రమం జిల్లా వనరుల కేంద్రం, నరసరావు పేట వారిచే పిడుగురాళ్ళ వ్యవసాయ సహాయ సంచాలకులుశ్రీ కృష్ణదేవరాయలు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. శిక్షణా కార్యక్ర మంలో జిల్లా శిక్షణా కోఆర్డినేటర్ ఎం. శివ కుమారి ప్రత్తి లో గులాబీ రంగు పురుగు, రసం పీల్చు పురుగుల యాజమాన్య పద్ధతులు గురించి వివరిస్తూ ప్రత్తి లో గులాబీరంగు పురుగు వల్ల మన ప్రాంతంలో ప్రత్తి విస్తీర్ణం తగ్గిపోతోందని, ఈ పురుగు అదుపునకు లింగాకర్షక బట్టలు పెట్టడం, జెల్ టెక్నాలజీ మరియు రోప్ టెక్నాలజీ వాడుకోవాలని, మొదటగా గుడ్ల మీద పనిచేసే వేప సంబంధిత మందులు, ప్రొఫెనోఫోస్ వాడాలని తెలిపారు. జంగమహేశ్వరపురం శాస్త్రవేత్త సైదా నాయక్ వరి పంటలో, కంది పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. వరిలో నేరుగా విత్తే పద్ధతి పాటించడం, కంది లో కాయ ఈగ పట్ల అప్రమత్తంగా ఉండడం చేయాలని తెలిపారు. వరి లో రైతులు ఆకుముడత కనబడగానే మందులు వాడుతున్నారని, చిరుపొట్ట దశ వరకు దీని గురించి భయపడవలసిన అవసరం లేదని, ఒకవేళ పురుగు ఉధృతి అధికంగా వుంటే ఫ్లుబెండి అమైడ్ 0.2 గ్రాములు లేదా కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలని తెలిపారు. వ్యవసాయ అధికారి ప్రవీణ్ క్రాప్ లైఫ్ సిస్టమ్ యాప్ గురించి వివరించారు. శిక్షణా కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ప్రతి రైతు పంటను సెప్టెంబర్ 23వ తేదితో ముగుస్తున్నందున అందరూ పంట నమోదు చేసి ఈ కేవైసీ చేయించుకున్న వారికి మాత్రమే ఉచిత పంట భీమా వర్తించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు,డి.పాప కుమారి,కే. దేవ దాసు,కే.రామమ్మ, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# డయల్ యువర్ ఎమ్మెల్యేకి వచ్చే ఫిర్యాదులపై తక్షణ స్పందన



**పెద్దకూరపాడు, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా సమస్యల తక్షణ పరిష్కారానికి స్థానిక శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ డయల్ యువర్ ఎమ్మెల్యే అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు ప్రతినిధులను నియమించి వారి మొబైల్ నెంబర్ ల ద్వారా ఆయా మండలాల్లోని సమస్యలను తెలియపరిస్తే ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై క్షణాల్లో స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ప్రారంభించిన కొద్ది కాలంలోనే అచ్చంపేట మండలం జడపల్లి తండా ప్రజలు త్రాగునీరు లేక ఇబ్బందులు పడడం పై స్పందించి వెంటనే గ్రామానికి మంచి నీటి సదుపాయం కల్పించారు. అమరావతి మండలం అత్తలూరు ఎస్సీ కాలని పెద్దపల్లిలోని అంగన్వాడీ స్కూల్లోకి నీరు రావడంపై తక్షణమే స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకొన్నారు. విప్పర్ల చెక్ డ్యాంకు తుఫాన్ కారణంగా పడిన గండిని స్థానిక నాయకులు అధికారుల సాయంతో యుద్ధ ప్రాధికన పూడ్చి వేయించారు. వరదల కారణంగా దొడ్లేరు చెరువు పొంగుతుందనే ఫిర్యాదు పై తక్షణమే స్పందించి పరిష్కారం కోసం ముందస్తు చర్యలు చేపట్టారు. మాదిపాడు రామాలయం వీధిలో మంచినీటి బోరు బిగించేలా చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం కల్పించారు. అనంతవరంలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను స్థానిక నాయకుల సహకారంతో మార్పించి శాశ్వత పరిష్కారం సూచించారు. పెదకూరపాడు మండలంలో యుద్ధ ప్రాతిపదికన వరద డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరచడంతో పాటు పిచ్చి మొక్కలను,పేరుకుపోయిన మురుగును తొలగించడం,బ్లీచింగ్, చల్లించడంతో పాటు ఫాగింగ్ చేపించి పారిశుద్యాన్ని మెరుగు పరిచేలా చర్యలు తీసుకున్నారు.ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి క్రోసూరు మండలం లోని అన్నీ గ్రామాల్లో, వీధి లైట్ల ఏర్పాటు,పారిశుధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించారు. ఇలా డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో సమస్యలు సత్వరమే పరిష్కారం అవటంతో ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విజయవాడలో జరిగిన ధర్నాలో పాల్గొన్న వినుకొండ డాక్టర్లు



**వినుకొండ మేజర్ టౌన్ న్యూస్:** విజయవాడ ధర్నా చౌక్లో 1000కి పైగా ఏపీపీహెచ్సిడిఏ డాక్టర్లు పాల్గొన్న నిరసన కార్యక్రమం, విజయవంతంగా జరిగింది. జీవో నెంబర్. 85కు వ్యతిరేకంగా, తమ ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలనే నినాదంతో , కార్యక్రమంలో ఏపీపీహెచ్ సి డిఏ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైద్యులంతా తమ హక్కులను కాపాడుకోవడమే లక్ష్యంగా ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసిన తరువాత ఏపీపీహెచ్సి డిఏ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ, "జీవో. 85ను వెంటనే రద్దు చేసి, తమ డిమాండ్లను ప్రభుత్వమే నెరవేర్చాల్సిన అవసరం ఉందని" స్పష్టం చేశారు. కనీస వేతనాలు, పదోన్నతులు, ట్రైబల్ అలౌవాన్స్ మరియు ఇతర ముఖ్యమైన సమస్యలపై ప్రభుత్వం హామీ ఇవ్వకుండా ఈ నిరసనలు ఆగవని డాక్టర్లు తెలిపారు.ప్రస్తుతం పీ హెచ్ సి ల లో సేవలు నిలిచిపోవడం వల్ల ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై భారీ ప్రభావం పడుతుందని వారు సూచించారు. ఏపీపీ హెచ్సి డిఏ బృందం, సెప్టెంబర్ 15 మరియు 16 తేదీలలో కూడా ప్రభుత్వంతో సవివరమైన చర్చలు జరిపినా, స్పెషల్ సీఎస్ , కమిషనర్ హెచ్ ఎం ఎఫ్ డబ్ల్యూ హామీలు నెరవేర్చకపోవడం వల్ల ఈ నిరసన కార్యక్రమం చేపట్టాల్సి వచ్చిందని తెలిపారు.ఎక్కువమంది సభ్యులు నిరసనలో భాగస్వామ్యం అవుతారని, తమ హక్కుల కోసం ఎంత కాలం అయిన పోరాడతాం అని తెలిపారు. జి ఓ 85 స్టే లో పెడితే తాము చర్చలకు సిద్ధం అని వారు తెలిపారు.

# స్వచ్ఛతాహి సేవ పక్షోత్సవాలపై అవగాహన సదస్సు




**కారంపూడి, మేజర్ న్యూస్ :** స్వచ్ఛతాహి సేవ 2024 పక్షోత్సవాలపై కారంపూడి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ, ఈ యొక్క కార్యక్రమం ముఖ్య ఉద్దేశం స్వభావ్ స్వచ్ఛత, సంస్కార స్వచ్ఛత అంటే ప్రతి వ్యక్తి స్వభావంలో స్వచ్ఛతగా ఉండాలని సంస్కార్ స్వచ్ఛత అంటే పరిసరాలను మన ఊరిని స్వచ్ఛంగా ఉంచుకోవాలని మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, మన రాష్ట్ర ముఖ్యమంత్రి, మన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని తెలియజేయుచు సెప్టెంబర్ 17వ తేదీ నుండి ప్రతిరోజు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించుకోవాలని, మరియు ఈ పక్షోత్సవాలలో శానిటేషన్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్ పై పిల్లలకు అవగాహన కల్పించాలని, తడి పొడి చెత్తను గ్రామాలలో వేరువేరుగా సేకరించి ఎస్ డబ్ల్యూయుపిసి షెడ్లకు తరలించాలని, సైడ్ కాలువల పూడికలు తీయటం, గ్రామాలలో రోడ్లు వెంబడి చెత్త కుప్పలను తొలగించడం, త్రాగునీటి వనరులను సక్ర మంగా వినియోగించుకోవడం, గ్రామాలలోని నీటి ట్యాంకులలో క్లోరినేషన్ చేయించడం, వంటి కార్యక్రమాలు నిర్వహించాలని తెలియ జేశారు. మండలం పరిధిలోని అన్ని గ్రామాలలో ఈరోజు ప్రారంభ అంశమైన మానవ హారాలను జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో ఉన్నం లక్ష్మీనారాయణ, చప్పిడి రాము, మస్తాన్ జానీ, బాలు నాయక్, బత్తుల హరి, కటికల బాలకృష్ణ, విప్పర్ల ఆంజ నేయులు, ఒప్పిచర్ల సర్పంచి పుష్పావతి, బ్రహ్మ నాయు డు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం,అనంత శివ ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి సత్య ప్రసాద్, మండల కోఆర్డినేటర్ సుబ్బారావు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను ఉపేక్షించేది లేదు

## గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరిక

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య, బ్యూరో**



గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 33వ డివిజన్ పరిధిలోని బ్రాడిపేట 6/20లో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళ మాధవి హెచ్చరించారు. మంగళవారం ఘటన జరిగిన ప్రాంతాన్ని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... ఎన్టీఆర్ విగ్రహాన్ని కొంతమంది ఆకతాయిలు మదమెక్కి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఓ పార్టీకి చెందిన వ్యక్తులు వినాయక విగ్రహం ఊరేగింపు చేశారు. ఇది వారు చేశారా లేక ఆకతాయి చేశారా అనేది దర్యాప్తులో తెలియాల్సి ఉంది. దీనికి బాధ్యులైన ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. ఎన్టీఆర్ అంటేనే తెలుగుజాతి ఆత్మగౌరానికి ప్రతీక అని, అటువంటి ఎన్టీఆర్ విగ్రహం పైన దాడి జరిగింది అంటే ప్రతి తెలుగు వాడి మనోభావాలు కూడా దెబ్బతింటున్నాయి. స్థానికంగా ఉన్న ప్రజలు మరియు సిసి కెమెరాలు ద్వారా ఘటనకు కారణమైన వారి కోసం స్థానిక సీఐ నేతృత్వంలో దర్యాప్తు జరుగుతుంది. సాయంత్రం లోపు నిందితులను గుర్తిస్తామని సిఐ హామీ ఇవ్వడం జరిగింది. ఎన్డీయే కూటమి ఘన విజయాన్ని తట్టుకోలేక, ప్రజలకు ముఖం చూపించలేక ఇలా ఘటనలకు పాల్పడడం పిరికిపంద చర్య అని, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయం పైన దాడి చేసిన వారిని చట్టపరంగా శిక్షిస్తున్న కూడా ఈ సైకోలు చెలరేగిపోతున్నారంటే వారికి ఎంత అహంకారం, బరితెగింపు ఉన్నదో ప్రజలు ఆలోచించాలి. ఎమ్మెల్యే వెంట స్థానిక డివిజన్ అధ్యక్షులు పోపురీ నరేంద్ర,వజ్జా సూర్యం,ఉప్పుటూరి పేరయ్య,రామకృష్ణ,టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కసుకుర్తి హనుమంత రావు, తాళ్ళ వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ 74వ జన్మదినవేడుకలు

**మాచర్ల/దుర్గి మేజర్ న్యూస్ :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 74వ జన్మదిన వేడుకలను మండలకేంద్రమైనదుర్గిలో మంగళవారం ఘనంగానిర్వహించారు. ఈవేడుకలకు బిజెపి మండలఅధ్యక్షుడు వెలిదండి శ్రీనివా సరావు అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమాన్ని బిజెపి ,టిడిపి, జనసేన కూటమి ఆధ్వర్యంలో చేపట్టారు. ముఖ్యఅతిధిగా మాచర్ల ఎమ్మెల్యేజూలకంటి బ్రహ్మానందరెడ్డి వి చ్చేసి జన్మదిన కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలకు ధీటుగా భారతదేశం అభివృద్ధి బాటలో నడపడానికి మనదేశ ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అవిరళ కృషి అభినందనీయమని అన్నారు. మోడీ 74వ జన్మదినవేడుకలను పురస్కరించుకుని సీనియర్ జర్నలిస్టు కోటయోహాను, బిజెపి సీనియర్ సిటిజన్ జక్కాసీతారామయ్య, డిబియస్సెస్ రాష్ట్ర అధ్యక్షుడు కుక్క మూడి ప్రసాద్ లను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. తదుపరి యంపిడిఓ కార్యాలయంవద్ద మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో యంపిపి యేచూరి సునీత సాయి శంకర్,బిజెపి పల్నాడుజిల్లా ఉపాధ్యక్షులు నాయకులు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, జె.వి.బ్రహ్మయ్య,కాశిపతి, కప్పెర లక్ష్మీ, పెద్దిరాజు, ఎన్.మరియదాసు, టి.కోటేశ్వరరావు, మల్లయ్య, జనసేననాయకులు పులిహరి తోటకూర శ్రీనివాసరావు,రద్రాల రవి,టిడిపి నాయకులు కటకం రామారావు, సూరె వెంకటేశ్వర్లు, జక్కా కొండలు, శ్రీ రాం కాశీ బాబు గుండా అంకారావు, జక్కా రమేష్,పగడాల చెన్నకేశవవులు, తదితరులు పాల్గొన్నారు.



## మేడిశెట్టి ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆర్థిక సహాయార్థం..

**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నరసరావుపేట జనసేన పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మేడిశెట్టి రామారావు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం అవనిగడ్డకు మంగళవారం నరసరావుపేట పార్టీ కార్యాలయం నుండి సుమారు రూ.2 లక్షలకు సంబంధించి బట్టలు, సరుకులు, మెడిసిన్స్ తదితర సామాన్లు పల్నాడు జిల్లా నరసరావుపేట పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నరసరావుపేట జనసేన పార్టీ ఇంచార్జ్ సయ్యద్ జిలాని జండా ఊపి ప్రారంభించి సరుకులను పంపించారు.

## నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే..



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** నరసరావుపేటలో జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంలో పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబులు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో విద్యార్థినీ, విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డిఎంహెచ్వో, గవర్నమెంట్ హాస్పటల్ సూపర్డెంట్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ గుంటూరు సహకారంతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 74 వ జన్మదినోత్సవం సందర్భంగా నరసరావుపేటలోని ఎస్.ఎస్. అండ్ ఎన్, వాగ్దేవి డిగ్రీ కాలేజ్, జేఎన్టీయూకే కాలేజ్, కళాశాలలలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం జరిగినదని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట శాసనసభ సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత దేశ ప్రధాని జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం చాలా గొప్పదన్నారు. కార్యక్రమాలలో అనేకమంది యువతి, యువకులు పాల్గొని రక్తదానం చేయడం ఆనందంగా ఉందని వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయండి.. ప్రాణలను కాపాడండి అనే నినాదంతో ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని సూచించారు. అనంతరం రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.వి.యం శరత్ బాబు, కోశాధికారి మురళీకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కే యం యన్ వి శ్రీనివాస గుప్తా, బత్తుల మురళి, డాక్టర్ సృజన, డాక్టర్ రెహమతుల్లా, సత్తెనపల్లి చైర్మన్ పుట్టి సాంబశివరావు, వినుకొండ చైర్మన్ బి.వి. ఎల్ ప్రసాద్, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ రంగిశెట్టి రామకృష్ణ, మాజీ కౌన్సిలర్ మస్తాన్ వలి, చేగు వెంకటేశ్వరరావు గారు, బిజెపి నాయకులు టౌన్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మట్టా ప్రసాద్, కోశాధికారి సత్యనారాయణ,మల్లెపు కృపారావు, మకుటం శివ, జన్నభట్ల ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల స్థలాన్ని కబ్జా నుండి కాపాడండి - కాలేజీ విద్యార్థులు



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** పిడుగురాళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని ఆక్రమించి రోడ్డు వేస్తున్న కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు. కళాశాల విద్యార్థులు ఈ విషయం ఎస్ఎఫ్ఐ నాయకులు దృష్టికి తీసుకువచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ కూడా అధికారులు నిర్లక్ష్యం వైఖరి ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డు పనులు నిలపాలని కోరుతో విద్యార్థులు విషయాన్ని ప్రభుత్వ అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లిన పట్టించుకోకుండా చూస్తున్నారని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. కాలేజీ స్థలం ఆక్రమణ గురికాకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వాలపై వున్నదని పల్నాడు జిల్లా పిడుగురాళ్ల భారత విద్యార్థి ఫెడరేషన్ నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు దత్త సాయి నాయక్, అమర్, గోపీచంద్, మంజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముంద్రుకి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే చదలవాడ



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలం గోగులపాడు గ్రామానికి చెందిన ముంద్రు గోవింద రాజు మంగళవారం అకాల మరణంతో చనిపోయారు. ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహణ కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, గ్రామ నాయకులు.

## పత్తి రైతులను ఆదుకోవాలి : మునుగోటి శ్రీనివాసరావు



**పెదకూరపాడు, మేజర్ న్యూస్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నియోజవర్గ పరిధిలోని పెద కూరపాడు, క్రోసూరు, అమరావతి, అచ్చంపేట మండలాల్లో కృష్ణానది పరివాహ ప్రాంతంలో పత్తి రైతులు కుదేలయ్యారని పెదకూరపాడు నియోజవర్గ సిపిఐ కార్యదర్శి మునగోటీ శ్రీనివాసరావు అన్నారు. నియోజవర్గ కేంద్రమైన పెద్దకూరపాడు లో రెవెన్యూ శాఖ అధికారులకు వ్యవసాయ శాఖ అధికారులకు రైతు సంఘం సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం వినతపత్రాన్ని అందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం శ్రీనివాసరావు రైతు సంఘం నాయకులు సుభాని మాట్లాడుతూ ఇప్పటికే పత్తి కౌలు రైతులు రైతులు ఎకరానికి 50 వేల రూపాయలు పెట్టుబడి అయితే కురిసిన వర్షాల కారణంగా నష్టం జరిగిందని రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులు కొంత పొలం నష్టము అంచనా వేసినప్పటికీ, పత్తి చేలు వడబడిపోయి ఆకు, పూతా, పిందె రాలిపోవడంతో రైతులు కోలుకునే పరిస్థితి లేదని ఎకరానికి 30 వేలు నష్ట పరిహారం అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోపూరు సుభాని మలినేని బసవయ్య. చిర్రా సాంబిరెడ్డి సబ్జాన్ మస్తాన్వలి సిపిఐ నాయకులు కడియాల శ్రీనివాసరావు, ఎస్కే నాగుల మీరా, తాళ్లూరి రాంబాబు తదితరులు పాల్గొని రెవెన్యూ వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

## పెండింగ్ బిల్లుల మంజూరు

**వినుకొండ, మేజర్ న్యూస్ :** 2014-19 మధ్య ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరై పెండింగ్ బిల్లు ఉన్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం చల్లని కబురు తెలిపింది.వైకాపా పాలనలో బిల్లు చెల్లించకుండా ఐదేళ్లుగా లబ్ధిదారులను ఇబ్బంది పెట్టారు. ఈ విషయాన్ని వినుకొండ శాసనసభ్యులు జీవి ఆంజనేయులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తేవడంతో పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు అంగీకరించిందని టిడిపి నాయకులు తెలిపారు. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు వెరిఫికేషన్ చేస్తున్నారు. అవి పూర్తి కాగానే లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడం జరుగుతుంది. పట్టణంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన ఇంటి గృహప్రవేశం మంగళవారం నిర్వహించారు. ఇందులో గృహ నిర్మాణ శాఖ ఏడి శ్రీనివాసరావు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ తెలుగుదేశం పార్టీ నాయకులు ఆయుబ్ ఖాన్, షమీంఖాన్, పత్తి పూర్ణచంద్రరావు, సౌదాగర్ జానీ భాష పీవీ సురేష్ అజీజ్ గంగినేని సుబ్బారావు నాసరయ్య ఇర్ల ప్రసాద్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం ప్రారంభోత్సవం




**చిలకలూరిపేట, మేజర్ న్యూస్ :** పట్టణంలో పురపాలక సంఘం నందు మునిసిపల్ కమీషనర్ సి. హెచ్ గోవిందా రావు ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛత హై సేవ - 2024 కార్యక్రమంలో భాగముగా మంగళవారం స్వచ్ఛత హై సేవ అవగాహన ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుండి ప్రారంభిం చట్టం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పురపాలక సంఘ మునిసిపల్ చైర్మన్ షేక్. రఫాని పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛత హి సేవ ర్యాలీని ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే



**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** స్వచ్ఛత హి సేవ ర్యాలినీ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ తరువాత ర్యాలీని అతిథులు ప్రారంభించారు. అనంతరం పల్నాడు బస్ స్టాండ్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీని చేశారు. ర్యాలీలో మునిసిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛత కోసం పాటుపడాలి

**గుంటూరు, మేజర్ న్యూస్ :** కేంద్ర జి.ఎస్.టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి ప్రభుత్వ కార్యాలయాన్ని అందంగా, పరిశుభ్రంగా వుంచడంలో ఉద్యోగులందరూ స్వచ్ఛత దిశగా కొంత సమయాన్ని కేటాయించుకోవాలని సెంట్రల్ జీఎస్టీకమిషనర్ సాధునరసింహారెడ్డి సూచించారు. స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవం లో భాగంగా మంగళవారం గుంటూరుకన్నవారితోట సెంట్రల్ జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్వచ్ఛత శపథం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ..చేసిన శపథానికి తగినట్లుగా ప్రతి ఉద్యోగి స్వచ్ఛత అవగాహన, చైతన్య ప్రచారాలుచేపట్టాలన్నారు. పక్షోత్సవం లో భాగంగా ఉపయోగం లేని వేలాది ఫైళ్లు, వస్తూసామాగ్రి ని తరలించాలన్నారు. కార్యాలయంలో దుమ్ము, ధూళి లేకుండా ఉద్యోగులు ఎవరి విభాగాలను వారే స్వయంగా శుభ్రపరచుకోవాలన్నారు. పరిశుభ్రత అనేది ఒక నిరంతర ప్రక్రియ అన్నారు. ఇది ఒక మహాయజ్ఞంలాంటిదన్నారు. పరిశుభ్రత తోనే మంచి ఆరోగ్యం దక్కుతుందన్నారు. మంచి ఆలోచనలు, భావాలు కలుగుతాయన్నారు. పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమిష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. స్వచ్ఛాభారత్ ను ప్రభుత్వమేవిజయవంతం చేయాలని అనుకోకుండా, ప్రతి ఒక్కరూ తన వంతు



బాధ్యతాయుతంగా ప్రగతి సాధనలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఉద్యోగుల చేత కమిషనర్ నరసింహారెడ్డి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛాభారత్ మిషన్ మార్గ దర్శక సూత్రాలు వివరించారు. కార్యక్రమంలో ఐ ఆర్ ఎస్ అధికారులు బి.లక్ష్మినారాయణ,ఎం.నాగరాజు,బి.రవికుమార్, వి.సచ్చిదానంద సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, టివిజికే మూర్తి, యుగంధర్, నవీన్ రాజు, సురేష్, కాకర్ల తదితరులు పాల్గొన్నారు.

# చేబ్రోలు లో ఘనంగా పోషణ్ మహా కార్యక్రమం నిర్వహణ



**గుంటూరు, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చేబ్రోలు పోషణ మహా కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. చేబ్రోలు లోని రజక పేట అంగనవాడి సెంటర్లో ఒకటో సచివాలయం పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు అన్నప్రాసన, పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు ఎలా ఇవ్వాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న చేబ్రోలు సెక్టార్ సూపర్వైజర్ ప్రేమలత ఈ కార్యక్రమంలో పాల్గొన్న తల్లిదండ్రులు, గర్భిణీ స్త్రీలు, చిన్నారులకు అవగాహన కల్పించారు.. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారి ప్రసాదరావు తదితరులు చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఎంతో ఉత్సాహంగా అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పాల్గొన్నారు. పలువురు అంగన్వాడి కార్యకర్తలు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను అక్కడికి తీసుకువెళ్లి చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు చూపించి వాటిని ఎలా తయారు చేయాలో వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాలు ఎలా తయారు చేసుకోవాలో కూడా వివరించారు.

# మద్యం దుకాణంలో చోరీకి పాల్పడిన ఉద్యోగి అరెస్ట్

**గుంటూరు క్రైం, మేజర్ న్యూస్:** పంట పొలానికి రక్షణగా ఉండాల్సిన కంచే... ఆ పంట పొలాన్ని మేసినట్లుగా.... మద్యం దుకాణంలో పనిచేస్తున్న ఉద్యోగి అదే దుకాణంలో చోరీకి పాల్పడటం గమనార్హం. పొన్నూరు మద్యం దుకాణంలో జరిగిన చోరీ సంఘటనలో అక్కడ పనిచేస్తున్న సందీప్ అనే ఉద్యోగిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టు వివరాలను జిల్లా ఎస్పీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ నెల 16వ తేదీన పొన్నూరు టౌన్ బాపట్ల బస్ స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ జరిగింది. దుకాణం సూపర్వైజర్ నేలిన్ బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా అదే దుకాణంలో విధులు నిర్వహిస్తున్న సందీప్ ఈ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించారు. ఇతను చోరీ చేయాలి అనే ఆలోచనతో గత కొన్ని రోజులుగా దుకాణం కు రాకుండా సెలవు పెట్టాడు. క్యాష్ పెట్టకు సంబంధించి ఒక తాళాన్ని దొంగిలించాడు. వరుసగా మూడు రోజులు బ్యాంకు సెలవు రావడంతో మద్యం విక్రయించన సొమ్ము దుకాణంలో ఉండిపోయింది. ఎక్కువ సొమ్ము ఉందని నిర్ధారించుకున్న సందీప్ 15వ తేదీ అర్ధరాత్రి కారులో దుకాణం వద్దకు వచ్చాడు. వెనుక షట్టర్ను ధ్వంసం చేసి లోనికి వెళ్ళాడు. క్యాష్ పెట్టి లో ఉన్న నగదు రూ.9,51,460 కారులో



అపహరించుకుపోయాడు. అతన్ని అరెస్ట్ చేసి నగదును స్వాధీనం చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన తెనాలి డిఎస్పి జనార్ధన రావు, పొన్నూరు టౌన్ సిఐ కె రవి కిరణ్, స్టేషన్ సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

## పురపాలకసంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ '



**తెనాలి టౌన్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వారు నిర్ణయించిన స్వచ్ఛత హీ సేవ - 2024, కార్యక్రమము తెనాలి పురపాలక సంఘ కార్యాలయం నుండి ర్యాలీ గా, గంగానమ్మ పేట నుండి సాయిబాబా గుడి మీదుగా తెనాలి రేల్వే స్టేషన్ వరకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో తెనాలి మునిసిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, వైస్ చైర్ పర్సన్ మాలేపాటి. హరిప్రసాద్, మునిసిపల్ కమిషనర్ బండి. శేషన్న, హెల్త్ ఆఫీసర్ డాఎఎహెలన్ నిర్మల, మునిసిపల్ ఇంజనీర్ శ్రీనివాస్, కౌన్సిలర్ లు,తాడిబోయిన రామయ్య, మొఘల్ అహ్మద్,హారే రామ్, శానిటరి ఇన్స్పెక్టర్స్ ఏ.రామచంద్రరావు,జి.ప్రసాద్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ మరియు తెనాలి రైల్వే స్టేషన్ మేనేజర్ టి. వెంకటరమణ, మరియు స్టేషన్ సిబ్బంది అనిల్ కుమార్ సింగ్, రామకోటేశ్వరరావు, రవిబాబు, కిరణ్ బాబు మరియు మునిసిపల్ ఇండోర్ అవుట్ డోర్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భముగా చైర్ పర్సన్, మాట్లాడుతూ,ఈ కార్యక్రమం లో పాల్గొని విజవంతం చేసిన ప్రతి ఒక్కరికి మీడియా మిత్రులకు ప్రతేక ధన్యవాదములు తెలియజేసారు.

## బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు:

**తెనాలి మేజర్ న్యూస్:** ప్రపంచంలో భారత్ అగ్రగామిగా ఉండాలన్న ఆకాంక్షతో,2047 కి, వికసిత్ భారత్ దేశం ఉండాలని నిత్యం దేశం కోసం ధర్మం కోసం నిరంతరం కృషి చేస్తున్న మన ప్రధాని నరేంద్ర మోడీ గారికి జన్మదిన శుభాకాంక్షలు



తెలియజేస్తున్నామని, పట్టణ బిజెపి అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక శివాజీ చౌక్ లో మిఠాయిలు పంపిణీ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి అనంతచార్యులు మాట్లాడుతూ, 370 ఆర్టికల్ రద్దు, త్రిబుల్ తలాక్ రద్దు, వంటి అంశాలలో వెనకడుగు వేయకుండా దేశాన్ని ముందుకు తీసుకుపోతున్న మన ప్రధాని ఇంకా మరెన్నో విజయాలు సాధించాలన్నారు. రాష్ట్ర పదాధికారి,నెల్లూరు జిల్లా ఇన్చార్జి, గాజుల వెంకయ్యనాయుడు మాట్లాడుతూ ఉండాలని, అలాగే అన్ని దేశాలకు మధ్యవర్తిగా ఉండాలని కోరుతున్న మన ప్రియతమ ప్రధానికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి ప్రధాన కార్యదర్శి. దారా సాయి గుప్తా వెచ్చ నాగరాజు, శిఖ రవీంద్ర, జిల్లా మైనారిటీ మోర్చా ఉపాధ్యక్షుడు కుశల్ కుమార్ జైన్, వెంకటేశ్వరరావు, దుద్దుకూరి హనుమంతరావు, అడుసుమిల్లి సుధాకర్ రావు, డి.వీరయ్య,పలువురు పార్టీ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోట సచ్చిదానంద శాస్త్రి మృతి కళా రంగానికి తీరని లోటు



**గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్ :** ప్రముఖ హరికథా భాగవతార్ పద్మశ్రీ పురస్కార గ్రహీత కోట సచ్చిదానంద శాస్త్రి మృతి కళా రంగానికి తీరని లోటని సంస్కృతి సంగీతం నృత్య నాటక సాహిత్య సంస్థ నిర్వాహకులు సత్రాజు బాలచందర్రావు ఒక ప్రకటనలో తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. కోట సచ్చిదానంద శాస్త్రి (90)అమరావతి రోడ్డులోని ఆయన స్వగృహంలో సోమవారం రాత్రి 11 గంటలకు శివైక్యం చెందారు.ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు.

## సమస్త విశ్వానికే సృష్టికర్త శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవానుడు



**గుంటూరు (సాంస్కృతికం) మేజర్ న్యూస్:** సకల చరాచర సృష్టికి మూల కారణం విశ్వకర్మ భగవానుడని ఎమ్మెల్యే గళ్ళ మాధవి అన్నారు స్థానిక అమరావతి రోడ్డు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర దేవస్థానంలో మంగళవారం విశ్వకర్మ ధ్వజాన్ని ఆవిష్కరించి, విశ్వకర్మ యజ్ఞంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ విశ్వకర్మ కౌన్సిల్ యోజన పథకాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అన్ని రకాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో దేవాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ అభివృద్ధి కమిటీ చైర్మన్ కడియాల సుబ్బారావు, కన్వీనర్ ఉమ్మజోడు నాగేశ్వరచారి , పి లక్ష్మణ చారి మేడిపి ప్రసాదు, బజరంగ్ రామకృష్ణ శివరామకృష్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఓబులనాయుడుపాలెంలో తల్లికి వందనం

**గుంటూరు రూరల్, మేజర్ న్యూస్:** గుంటూరు రూరల్ మండలం ఓబుల నాయుడు పాలెం గ్రామంలో మంగళవారం తల్లికి వందనం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కాలువ గట్టుపై ఎంపీడీవో ఆదినారాయణ రావు మొక్కలు నాటారు. స్వచ్ఛత హై సేవ



కార్యక్రమం లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ ఖుద్దూస్, ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి యమున, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## విశ్వకర్మ జయంతి' సందర్భముగా అన్నదానం



**తెనాలి టౌన్ న్యూస్ :** సృష్టికర్త -విశ్వకర్మ 'భగవానుడి జయంతి సందర్భంగా, పట్టణం లోని, టీబి రోడ్ లో గల, విశ్వకర్మ దేవస్థానం నందు, విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుండి భక్తులు, అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థ, ప్రసాదాలను స్వీకరించి, కానుకలు, మొక్కులు చెల్లించుకున్నారు. విశ్వకర్మ భగవానుని రథోత్సవం జరగనున్నదని,ఈ కార్యక్రమం, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం, యువజన సంఘం, వారి ఆధ్వర్యంలో జరగబోతున్నదని, ఆలయ కమిటీ నిర్వాహకులు,గుంటముక్కల నాగార్జున తెలిపారు.

## ఆర్టీసీ డిపోలో - స్వచ్ఛత సేవ పక్షోత్సవాలు'



**తెనాలి మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సెప్టెంబర్ 17నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు "స్వచ్ఛత సేవ పక్షోత్సవాలు" కార్యక్రమాన్ని జరపవలసి ఉన్నదని,అందులో భాగముగాతెనాలి బస్ స్టేషన్ నందు70 మంది ఉద్యోగులతో ప్రతి రోజూ ఉదయం 9గంటల నుండి 11 గంటల వరకు స్వచ్ఛత సేవ కార్యక్రమము నిర్వహించడం జరుగుతున్నదని,ఆర్ టీసి, డిపో మేనేజర్, రాజశేఖర్ తెలియజేసారు. అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ , అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, హెడ్ కానిస్టేబుల్ , అన్ని యూనియన్ అసోసియేషన్ నాయకులు మరియు సిబ్బంది పాల్గొని, డిపో ప్రాంగణం, గ్యారేజి ప్రాంగణం శుభ్రం చేయుట జరిగినదని, అదేవిధంగా ప్రతిరోజు అక్టోబర్ 1వ తేదీ వరకు ఈ స్వచ్ఛత సేవ కార్యక్రమము నిర్వహించబడుతున్నదని, డిపో మేనేజర్, ఒక ప్రకటనలో తెలిపారు.

## నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ టాబ్లెట్లు పంపిణీ

**తెనాలి మేజర్ న్యూస్:** మున్సిపల్ఆరోగ్యాధికారిణిడాక్టర్ కారుమూరుహెలెన్ నిర్మలగారు : తెనాలి సెప్టెంబర్ 17 : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా తెనాలి మున్సిపల్ కమిషనర్ బండిశేషన్న గారి మౌఖిక ఆదేశాల ప్రకారం కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిరమునిసిపల్ బాలికోన్నత పాఠశాల నందు మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరు హెలెన్ నిర్మల గారి చేతుల మీదుగా స్కూలు విద్యార్థినులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేయడం జరిగినది.